వర్క్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు అంటే...

ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం, ఉద్యోగిత, నిరుద్యోగం

పేదరికమనే భావన బహుముఖమైంది. తక్కువ ఆదాయం, తక్కువ వినియోగం స్థాయిల బట్టి కాకుండా మిగతా సాంఘికాభివృద్ధి సూచికలైన విద్య, ఆరోగ్యం, కనీసావసరాలు తీర్చుకొనే శక్తి మొదలైనవి ఆదాయేతర పేదరిక (Nonincome poverty) నిర్వచనం కిందకు వస్తాయి. దేశంలో ప్రజల జీవన ప్రమాణాల వృద్ధికి పేదరికం ప్రతిబంధకంగా ఉందని మొదటి ప్రణాళికా కాలంలోనే పాలకులు గ్రహించారు. అయితే వ్యయాల స్థాయి విధానం (Expenditure Approach) ప్రకారం ఆరో పంచవర్ష ప్రణాళిక నుంచి.. రూరల్ ప్రాంతంలో 2400, అర్బన్ ప్రాంతాల్లో 2100 క్యాలరీలు వినియోగించే కొనుగోలు శక్తి ఉన్నవాళ్లను పేదరిక స్థాయికి ఎగువన ఉన్న వారిగా నిర్వచించారు.

1947 నుంచి ప్లానింగ్ కమిషన్ నియమించిన పేదరిక అంచనాల నిపుణుల కమిటీ (Expert Group on Estimates of Poverty) దేశంలో పేదరిక స్థాయిలు, రాష్ట్ర సంబంధిత (State Specific) పేదరిక రేఖలను కూడా పరిశీలించి అంచనాలు చేస్తోంది. పేదరిక రేఖను ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో అగ్రికల్చర్ లేబర్ ప్రైస్ ఇండెక్స్ (CPIAL), అర్బన్ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ వర్కర్స్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్‌ను ఉపయోగిస్తారు.

యూనిఫార్మ్, మిక్స్‌డ్ రీకాల్ పద్ధతిలో పేదరిక అంచనాలను ప్లానింగ్ కమిషన్ వేస్తుంది. యూనిఫార్మ్ రీకాల్ పద్ధతి ప్రకారం 30 రోజుల కాలంలో ప్రజలు వివిధ వస్తువులు (ఆహార, ఆహారేతర) వినియోగించే స్థాయిలు బట్టి మన దేశంలో పేదరిక స్థాయి 1993-94లో జనాభాలో 36 శాతం ఉండగా, 2004-05లో 27.5 శాతానికి తగ్గింది. మిక్స్‌డ్ రీకాల్ పద్ధతిలో యూనిఫాం రీకాల్ పద్ధతిన ప్రజలు గత 30 రోజుల్లో చేసిన ఖర్చు, గత 365 రోజుల్లో ప్రజలు తరచూ ఖర్చు పెట్టే 5 ఆహారేతర (Non-food) వినియోగ వస్తువులైన వస్త్రాలు, చెప్పులు, డ్యూరబుల్ వస్తువులు, విద్య, వైద్యంపై వెచ్చించే ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారు. మిక్స్‌డ్ రీకాల్ పద్ధతి ప్రకారం భారత్‌లో పేదరిక స్థాయికి దిగువున ఉన్నవారు 1999-2000లో 26.1 శాతం ఉండగా, 2004-05 నాటికి 21.8 శాతానికి తగ్గింది.

పట్టిక 1లో చూపిన విధంగా యూనిఫార్మ్ రీకాల్ పీరియడ్‌లో ప్రజలు ఉపయోగించిన వినియోగ వస్తువుల సరళి బట్టి ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిష్పత్తి గ్రామీణ ప్రాంతాల్లో 11.20 శాతం, పట్టణ ప్రాంతాల్లో 28 శాతం, రాష్ట్రం మొత్తానికి పేదరిక నిష్పత్తి 15.80 శాతంగా ఉంది. ఇదే 1993 -94లో 22.19 శాతంగా ఉంది. పేదరికం మిక్స్‌డ్ రీకాల్ పీరియడ్ (MRP) ప్రకారం 2004-05లో రాష్ట్రంలో గ్రామీణ పేదరికం 11.10 శాతంగా ఉండగా, పట్టణ పేదరికం 20.70 శాతం, మొత్తం రాష్ట్రంలో పేదరికం 11.10 శాతంగా ఉండగా ఇదే పేదరిక స్థాయి (MRP ప్రకారం) రాష్ట్ర స్థాయిలో 1993-94లో 15.77 శాతంగా ఉంది.

దేశం, రాష్ట్రంలో పేదరిక స్థాయికి దిగువున ఉన్న ప్రజల సంఖ్య గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తగ్గింది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక శాతం ఆల్ ఇండియా స్థాయి కంటే తక్కువగా ఉంది. దీనికి కారణం ప్రధానంగా సబ్సిడీపై బియ్యం సరఫరా. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో పేదరికం దేశ సగటు కంటే ఎక్కువగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో లేబర్ ఫోర్స్, వర్క్ ఫోర్స్: లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (LFPR) అంటే ప్రతి వెయ్యి మందిలో ఎంత మంది లేబర్ ఫోర్స్‌గా ఉండగలరో నిర్ధారించడం. 1999-2000తో పోలిస్తే, 2004-05లో LFPR రాష్ట్రంలో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఆల్ ఇండియా లెవల్ కంటే ఎక్కువ ఉంది. ప్రతి 1000 మంది లేబర్ ఫోర్స్‌లో ఎంత మంది (కనీసం 4 గంటలు లేదా రోజంతా గాని) ఏదైనా ఉత్పాదక పనిలో ఉంటారో దానిని వర్క్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (WFPR) అంటారు. 2004-05 వరకు NSSO అంచనాల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌లో రూరల్ LFPR ప్రతి వెయ్యి మందికి 492గా ఉండగా WFPR 439గా ఉంది. ఈ విలువలు 2004 -05 నాటికి జాతీయ స్థాయిలో.. పట్టణ ప్రాంతాల్లో LFP R-364, WFPR-334గా ఉన్నాయి. (పట్టిక-2) మొత్తం మీద జాతీయస్థాయి కంటే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో లేబర్ /వర్కర్ పార్టిసిపిషన్ రేట్లు హెచ్చుగా ఉండడం గమనార్హం. మహిళా లేబర్ /వర్కర్ పార్టిసిపేషన్ రేట్లు కూడా రాష్ట్ర స్థాయిలో ఎక్కువగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగిత: రాష్ట్రంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజిల రికార్డుల డేటా ప్రకారం 1966 మార్చి నాటికి వ్యవస్థీకృతరంగం (Organise Sector)లో 8900 సంస్థలు (పబ్లిక్ రంగంలో 3123, ప్రైవేట్ రంగంలో 5777) ఉండేవి. అవి 2008 మార్చినాటికి 21,749 సంస్థలు (పబ్లిక్ రంగంలో 13,789, ప్రైవేట్ రంగంలో 7960)గా వృద్ధి చెందాయి. 1966 మార్చి నాటికి 9.57 లక్షల మంది వ్యవస్థీకృత రంగంలో (పబ్లిక్ సెక్టార్‌లో 6.52 లక్షలు, ప్రైవేట్‌రంగంలో 3.01 లక్షల మంది) ఉండగా, ఆ సంఖ్య మార్చి 2008 నాటికి 20.9 లక్షలకు చేరింది. ప్రభుత్వ రంగంలో 13.65 లక్షలు, ప్రైవేట్ రంగంలో 7.25 లక్షల మంది పనిచేస్తున్నారు. మార్చి 2009 నాటికి 19.43 లక్షల మంది ఉద్యోగాల కోసం ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి రిజిస్టర్లలో నమోదు చేసుకున్నారు. 2008-09 సంవత్సరాల మధ్య వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాలు అదనంగా 0.52 లక్షలకు పెరిగాయి. 2007-08 నాటికి 20.38 లక్షల మంది ఉద్యోగాల్లో ఉండగా, 2009 మార్చి నాటికి ఆ సంఖ్య 20.90 లక్షలకు చేరింది.

ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వ నూతన చర్యలు: ఉద్యోగార్థులు, ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు సేవలందించడానికి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లన్నింటినీ కంప్యూటర్ నెట్‌వర్క్ కిందకు తీసుకొచ్చిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. విదేశీ సంస్థలతో మన రాష్ట్రంలోని నిరుద్యోగులను అనుసంధానం చేసి ఉద్యోగాలు కల్పించే ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (OMCAP) మార్చి 2006లో ఏర్పాటు చేశారు. 2010 నాటికి రాజీవ్ ఉద్యోగశ్రీ సొసైటీ ద్వారా మిలియన్ ఉద్యోగాలు ప్రైవేట్ రంగంలో కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రాష్ట్రంలో స్పిన్నింగ్ మిల్లులు, టెక్స్‌టైల్స్ పరిశ్రమల్లో 2010 నాటికి 2 లక్షల మంది వర్కర్లను నియమించే అవకాశాలున్నాయి. అదే విధంగా సెక్యూరిటీ గార్డుల రిక్రూట్‌మెంట్ ప్రైవేట్ రం గంలో భారీగా జరగనుంది. రాజీవ్ ఉద్యోగశ్రీ ద్వారా వీటికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. 2009 మార్చి నాటికి 1,75, 467 మంది శిక్షణలో ఉండగా, ఇప్పటిదాకా 9,21,050 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో 7.35 లక్షల మందికి వివిధ ఉద్యోగాలు లభించాయి.

రాష్ట్రంలో నిరుద్యోగిత: ప్రతీ 1000 మంది లేబర్ ఫోర్స్‌లో ఎంత మంది ఏ పనీ లేకుండా ఉన్నారో తెలిపే శాతమే నిరుద్యోగ రేటుగా భావిస్తారు. కరంట్ డైలీ స్టేటస్ (CDS) అంటే దైనందిన పద్ధతిలో ఒక వ్యక్తి, గత ఏడాదిలో అధిక భాగం (6 నెలలు కంటే ఎక్కువ) పనిచేస్తే ఆ వ్యక్తిని ఉద్యోగి అంటారు. అల్పభాగం పని చేస్తే లేదా ఏ మాత్రం పని చేయని వారిని నిరుద్యోగులుగా సాధారణ హోదా కింద పరిగణిస్తారు. CDS ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగిత రేటు ఆల్ ఇండియా స్థాయి కంటే ఎక్కువగా ఉంది. ఈ వ్యత్యాసం గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువ.

పట్టిక:1 ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక స్థాయి వివిధ పద్ధతుల్లో

సం॥	యూనిఫార్మ్ పీరియడ్		మిక్స్‌డ్ రీకాల్ పీరియడ్	
	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ
2004-05	11.20%	28.0%	11.10%	20.70%

పట్టిక:2 ఆంధ్రప్రదేశ్, ఇండియాలో పేదరిక రేఖకు దిగువన నివసిస్తున్న జనాభా (లక్షల్లో)

సంవత్సరం	ఆంధ్రప్రదేశ్			ఆల్ ఇండియా		
	గ్రామీణ	పట్టణ	కంబైన్డ్	గ్రామీణ	పట్టణ	కంబైన్డ్
1973-74	178.21	47.48	225.69	2612.90	600.46	3213.36
	(48.41)	(50.61)	(48.86)	(54.44)	(49.01)	(54.88)
1993-94	79.49	74.47	153.96	2440.31	763.37	3203.68
	(15.92)	(38.33)	(22.19)	(37.27)	(32.36)	(35.97)
2004-05	64.70	61.4	126.10	2209.24	807.96	3017.20
	(11.20)	(28.0)	(15.80)	(28.30)	(25.70)	(27.50)

మూలం: ఎపి ఎకనామిక్ సర్వే, 2008-09

నోట్ : బ్రాకెట్లలో ఉన్న సంఖ్యలు మొత్తం (కంబైన్డ్)లో శాతాలు.